# యాదృచ్ఛికం

**-కొత్తపల్లి ఉదయబాబు**

"ఎవడ్రా ఆ మేష్టు? యిపుడు సెప్పు. అన్నం తింట న్నాడా, గడ్డి తింటున్నాడా? ఏమయ్యా అటెండరూ, ఏరీ మీ పెద్ద పంతులయ్యగారున్నారా? ఉరిమినట్టున్న కంఠస్వరం తన గది బయట విన్న భీమశంకరం మాష్టారు కాలింగ్ బెల్ నొక్కారు.

అటెండర్ నారాయణ కంగారుగా లోపలకు వచ్చాడు.

ఆ వెనుకనే ముతక ఖద్దరు పంచె, జబ్బల బనీను ధరించి ఒక చేతిలో చుట్టను, మరొక చేత్తో పన్నెండేళ్ళ తన కొడుకుని పుచ్చుకుని అనుమతి తీసుకోకుండానే లోపలకు వచ్చేసిన 'అతను' రెండు క్షణాల క్రితం గది బయట మాటలతో గర్జించినవాడే అని గుర్తించిన భీమశంకరంగారు "రండి! కూర్చోండి!" అని తన కెదు రుగా ఉన్న కుర్చీ చూపించారు.

"నమస్తే పెద పంతులు గారు. మీ స్కూల్లో పిల్లల్ని సేర్పించింది సదువు సెప్పడానికా? లేక గారంగా పెంచుకుంటున్న మా పిల్లల్ని నరికి సంపెయ్యడానికా? అహ! నాకు తెల్వక అడుగుతాను సెప్పండి!" అన్నాడు కుర్చీలో కూర్చుని.

ఛూడండి. ఇది ప్రభుత్వ ఉన్నత పాఠశాల. అవతల క్లాసులన్నీ జరుగుతున్నాయి. మీరిలా పెద్ద కంఠంతో అరిస్తే వాళ్ళ ఏకాగ్రత చెదురుతుంది. మీరనే మాటలు నాకు వినిపిస్తున్నాయి. ముందది మీరు బయట పడవేసి ప్రశాంతంగా చెప్పండి. నేను విం టాను" అన్నారాయన వినయంగా అతని చేతిలోని చుట్టని చూస్తూ.

దానిని అలాగే కిటికీలోంచి బయటకు పారవేయ బోయి ప్రక్కనున్న నారాయణ కిచ్చాడతను. నారాయణ దానిని తీసుకు వెళ్ళి బయట పడేసి వచ్చి మళ్లీ అతని కుర్చీ ప్రక్కన నిలబడ్డాడు.

"ఇపుడు చెప్పండి. ఏమిటి మీ సమస్య?" అడిగా రాయన అతన్ని, అతని వెనుక వచ్చిన కొడుకుని చూసి.

"అయ్యగారు. ఆడెవడో కొత్తగా వచ్చిన లెక్కల మాష్టంట. మా పిల్లాడిని సూడండి. అరచేతులు కంది పోయేలా ఎలా బాదేశాడో? ఇంటికిచ్చిన లెక్కలు సెయ్య లేదనంట. అయితే మాత్రం నెమ్మదిగా సెప్పాల. సెయ్యకపోతే దగ్గర కూకోబెట్టుకుని సేయించాల. అంతేకాని అట్టా రక్తం సిమ్మేలా సావబాదేత్తే పిల్లాడు ఉండాలా సావాలా? పిలవండాణ్ణి. నేనంటే ఏమిటో సూపిత్తాను" అన్నాడు కొడుకు ఎడమ అరచేయిని చూపిస్తూ.

నిజంగానే అక్కడ రక్తం చిమ్మి కమిలినట్టుగా రెండు దెబ్బలు చారలు తేలి ఉన్నాయి.

ఛూడండి, మాష్టారు చేసింది తప్పే. అది స్పష్టంగా కనిపిస్తోంది. కాని మీ అబ్బాయికి చదువు చెప్పే ఉపాధ్యాయుడిని మీరే అతని ముందు 'వాడు' 'వీడు' అని అగౌరవపరుస్తుంటే అతను పెద్దలను గౌరవించడం ఎలా నేర్చుకుంటాడు చెప్పండి? ఇంకాస్త పెద్దవాడై చదువు పూర్తిచేసుకున్నాక మిమ్మల్ని 'ఆడు' 'నా బాబు' అని పిలిస్తే మీకెంత అవమానం చెప్పండి. ఏమం టారు?" అన్నారు భీమశంకరంగారు అనునయిస్తు న్నట్టుగా.

అతను గతుక్కుమన్నాడు.

"నిజమే పంతులయ్యగారు! అదేటంటారు? అయాము సారీ! అయితే మాత్రం ఆయన మా వోడిని అట్టా కొట్టేయడమేనా? పిలవండి. నేను మీ ముందే అడుగుతాను" అన్నాడు మళ్ళీ కోపగిస్తున్నట్టుగా.

ఛూశారా! మీరు మళ్ళీ రెండో తప్పు చేస్తున్నారు. మాష్టారు మీ అబ్బాయిని కొట్టిన దానికి సాక్ష్యం నేనే. కళ్ళారా చూశాను. ఆ మాష్టారిని యిప్పుడు యిక్కడకు పిలిపిస్తాను. మీ ముందే ఆయనను మందలిస్తాను. మరోసారి యిలా చేయవద్దని మళ్ళీ మళ్ళీ హెచ్చరి స్తాను. కాని దీనిని అలుసుగా తీసుకుని రేపు మీ వాడు తన తప్పు ఉన్నా సరే 'మా నాన్నతో చెప్పి నీ అంతు తేలుస్తా' అని మాష్టారినే బెదిరించే స్థాయికి వెళ్తే మీరేం చేయగలరు? ఆ తరువాత మిమ్మల్ని ఎదిరిస్తే?

పిల్లలు తప్పులు చేయడం సహజం. ఉపాధ్యా యులు దండించడం అంతకన్నా సహజం. అయినా ఈ విషయంలో మాష్టారు చేసినది ఖచ్చితంగా తప్పే. ఆయనను నేను పిలిచి మీ ముందే మందలిస్తే మీ అబ్బాయి రేపటి నుంచి ఆ మాష్టారి మాట వింటాడా? చెప్పండి. వింటాడు అంటే తప్పనిసరిగా యిపుడే పిలిపి స్తాను." భీమశంకరంగారు లౌక్యంగా అడిగిన తీరుకు అతను మాన్పడిపోయాడు. మాటాడకుండా ఉండి

పోయాడు.

"ఏరా నాన్నా! నువు ఏ క్లాసు చదువుతున్నావ్?" అడిగారు భీమశంకరంగారు.

"ఏడో తరగతి సార్?" చెప్పాడు వాడు.

"మాష్టారు నువు హోంవర్కు చేయకపోతేనే యింత గట్టిగా కొట్టారా? లేక నువ్వేమయినా తప్పు చేశావా?"

... ... ...

ఛూడు నాన్నా! నువ్వేదో పెద్ద తప్పు చెయ్యకపోతే మాష్టారు అంత తీవ్రంగా కొట్టరు. నిజం చెప్పు. నువు ఏమైనా తప్పుగా ప్రవర్తించావా?" ఆయన అనునయంగా, నెమ్మదిగా అడిగారు.

ఆ పిల్లవాడు తండ్రి ముఖంకేసి చూశాడు.

తండ్రి అతని టెంకె మీద ఒక్కటేశాడు.

"సెప్పురా ఎదవా? సెప్పు! నువు ఏం చేయకపోతే ఆయన అలాగ కొట్టి ఉండడు. నిజం సెప్పు."

"నేను.. నేను... సార్ గారు నా మీదకు నా నోట్సు విసిరారు. నాకు కోపం వచ్చింది. నేనూ ఆయన మీదకు ఆ పుస్తకాన్నే విసిరేశాను. అందుకని నా దగ్గరకు వచ్చి చేయి చాపమని బెత్తంతో నన్ను కొట్టారు" వాడు గుడ్ల నీళ్లు కుక్కుకుంటూ చెప్పాడు.

"మాష్టారి మీదకు పుస్తకం విసరడం తప్పా కాదా?" అడిగారు భీమశంకరంగారు.

"హోంవర్కు లెక్కలు నాకు రాలేదు. అందుకే చెయ్యలేదు అని చెప్పాను. దానికే ఆయన పుస్తకం నా మీదకు విసిరేశారు. ఆయన చేసింది తప్పు కాదా సార్?"

"నీకు హోంవర్కు లెక్కలు ఎందుకు రాలేదు?"

"నేను క్లాసులో పాఠం వినలేదు."

"ఎందుకు వినలేదు?" తండ్రి అడిగాడు.

"మా పక్కింటి రంగస్వామి గారబ్బాయి షష్టి తీర్థంలో కొనుక్కున్న చిన్న వీడియోగేమ్ క్లాసుకు తీసుకువచ్చాడు. దాన్ని నాకిచ్చి ఆడమన్నాడు. అందుకు!"

"ఇపుడు చెప్పు! నువు పాఠం వింటే హోమ్‌వర్క్ చేసుండేవాడివి కదా! అంటే మొదటి తప్పు నీదే. అవునా?" అన్నారు భీమశంకరంగారు.

"అవున్సార్! ఇంకోసారి అలా చెయ్యను"

ఛేస్తే నష్టపోయేది నువ్వే. మాష్టారికి నష్టం ఉండదు కదా! బడికి వచ్చి కష్టపడి చదువుకోవాలి. మీ నాన్న గార్కి చదువు అంటే ఎంతో యిష్టం ఉండబట్టే కదా యింత బాగా చూసుకుంటూ చదివిస్తున్నారు. నువు బాగా చదువుకుని ఆయన పేరు నిలబెట్టాలి. సరేనా?"

ఆ తండ్రి ఓసారి మీసం మెలేసి కొడుకుకేసి గర్వంగా చూశాడు.

"సరే సార్! అయామ్ సారీ సర్!" అన్నాడు వాడు.

"వెరీగుడ్ బోయ్! నువు కళ్ళు తుడుచుకుని క్లాసుకు వెళ్ళు. నారాయణా! నువు ఈ అబ్బాయిని ఏడో తరగతిలో దిగబెట్టి శివరామ్ మాష్టారిని గంటకొట్టిన వెంటనే నేను రమ్మన్నానని చెప్పు" అని నారాయణ వెంట ఆ అబ్బాయిని పంపారు.

"నాన్నా! నేను క్లాసుకు వెళ్తున్నా!" అనేసి ఆ అబ్బాయి నారాయణ వెంట వెళ్ళిపోయాడు.

వాళ్ళు గది దాటగానే-

ఛూడండి బాబూ! నేను మాష్టారిని పిలిచి మందలిస్తాను. ఆయన వచ్చేసరికి మీరు యిక్కడ ఉన్నా, లేదా ఆవేశం ఆపుకోలేక మీరే అతన్ని నిలదీసినా అతను మనస్తాపం చెందవచ్చు. అందువల్ల ఆ తర్వాత అతను మిగతా క్లాసులలో పాఠాలు సరిగా చెప్పలేకపోవచ్చు. దానివల్ల పిల్లలు నష్టపోతారు. అందుచేత మీకు నా మాట మీద నమ్మకం ఉంటే దయచేసి వెంటనే వెళ్ళిపొండి. ఏమంటారు?" అన్నారు భీమశంకరంగారు.

అతను ఏమనుకున్నాడో లేచి నిలబడి "సరే పంతులయ్యగోరూ! మీమీద గౌరవంతో ఎల్తన్నా! మా వోడిని ఓ కంట జాగర్తగా సూడండి. మీరు కూడా యిట్టాంటివి మా కాడకు రాకుండా సూసుకోవాల! వత్తాను!" అని ఓ ఉచిత సలహా పారేసి నిష్క్రమించాడు.

## ప్రతిబింబాలు

నీలాకాశంలోని నక్షత్రాలకు
పక్కున నవ్వే మా పత్తిపూలు

### కావాలి

ప్రతిభకు పెద్ద ఆశయం
ప్రశంసించదానికి పెద్ద మనసు

### వృధా

న్యాయాన్ని అడగని
మనసు
నిజాల్ని చూడని
కళ్ళు.

-డా॥ జరీనా బేగం

"అమ్మయ్య!" అనుకుని దీర్ఘంగా నిట్టూర్పు విడిచారు భీమశంకరంగారు.

○ ○ ○

భీమశంకరంగారు కుర్చీలో వెనక్కువాలి గోడ గడియారం చూశారు.

గంట కొట్టడానికి అయిదు నిముషాల సమయం ఉంది. శివరామ్.. ఈ మధ్యనే డి.యస్.సి. సెలక్షన్‌లో అప్పాయింట్ అయి తన దగ్గర చేరి మూడు నెలలౌతోంది.

ఎంతో చక్కని లాజిక్‌తో పాఠాలు బోధిస్తాడు. అతి స్వల్ప కాలంలోనే మంచి లెక్కల మాష్టారని పేరు తెచ్చుకున్నాడు.

కానీ ఆవేశపరుడు. తొందరగా ఆవేశపడిపోతాడు. మాట తూలతాడు. ఆపైన క్షమించమని అడగడానికి వెనుదీయడు. చాలా పశ్చాత్తాపపడతాడు.

అతను చేరిన మొదట్లో నెలకి అయిదారు యిలాంటి సంఘటనలు జరిగేవి. క్రమేపీ తన మాటల ప్రభావం వల్ల అతనిలో కొంత మార్పు వచ్చింది. యింకా రావాలి. పూర్తిగా ఓర్పు సహనం అలవడితే అతను తప్పక ఉత్తమ ఉపాధ్యాయుడౌతాడని తన నమ్మకం.

అతనిలో ఆ అసహనానికి ఒక కారణం అతను అవివాహితుడు కావడం కావచ్చు. పెళ్ళయి తనకూ పిల్లలు కలిగితే తప్పక అతనిలో మార్పు వస్తుంది.

అంతలోనే గంట మోగడం, వెను వెంటనే శివరామ్ గదిలోకి రావడం జరిగింది.

"రా! శివరామ్ రావయ్యా! కూర్చో" కుర్చీ చూపించారు భీమశంకరంగారు.

"సార్! ఎవరో వచ్చి నన్ను నానా కూతలూ కూశాడట. ఎవడు సార్ వాడు?" ఎంతో నిగ్రహంతో తన ఆవేశాన్ని అదుపు చేసుకుంటూ ముక్కుపుటాలు ఎగరేస్తూ అడిగాడు శివరామ్.

శివరామ్ వెనుక వచ్చిన నారాయణ కేసి భావోక్తిగా చూశారు భీమశంకరంగారు. నారాయణ తల వంచుకుని తప్పుచేసిన వాడిలా మెల్లగా జారుకున్నాడు.

"ముందు నువు కూర్చోవయ్యా! నేను చెప్పేది సావధానంగా విను. ఆ తరువాత నువు నీ యిష్టం వచ్చినంతసేపు మాట్లాడు. నేను వింటాను. సరేనా?"

శివరామ్ ముళ్ళమీద కూర్చున్నట్టు అసహనంగా కుర్చీలో కూర్చున్నాడు.

"నువు రేపు మా యింటికి భోజనానికి రావాలి!" ఆజ్ఞాపిస్తున్నట్టుగా అన్నారాయన.

అంత కోపంలోనూ శివరామ్ నవ్వలేకుండా ఉండలేకపోయాడు.

"సార్! ఏంటి సార్ మీరు? నన్ను పిలిపించింది దేనికి? మీరు చెబుతున్నదేమిటి?"

"అవును శివరామ్! నాకు కొంచెం మతిమరుపు ఎక్కువని నీకు తెలుసు కదా! అనుకున్న పని వెంటనే చెయ్యకపోయి మర్చిపోతుంటాను. రేపు భోజనానికి పిలవడానికే నిన్ను రమ్మన్నాను."

"లేదు సార్! మీరు, నేను బాధపడతానని ఏదో దాస్తున్నారు. ప్లీజ్ చెప్పండి సార్! నా వల్ల ఏదైనా తప్పు జరిగిందా సార్?" అడిగాడతను ఆతృతగా.

"శివరామ్! తప్పు ఎవరి వల్ల జరిగినా ఈవేళ సమాజంలో వేలెత్తి చూపించుకుంటున్న ఉపాధ్యాయుల జాతయ్యా మనది. నేను నిన్ను ఎల్లప్పుడూ కోరేది ఒక్కటే. ఈ వృత్తికి ఆత్మ సంయమనం ఎంతో అవసరం. అది

## మరపుకి మందు

వెల్గునీడల మధ్య వరండాలో వాలుకుర్చీలో కూర్చుంటే
చిన్న పిల్ల 'తుంపర' చెంపని స్పృశించిన మధురానుభూతి
తనువునేకాక మనసునీ తట్టి లేపినట్లయి కళ్లు తెరిచా
వరుణుడు రాల్చిన నీటిముత్యాలని
పదిలంగా ఏరుకుని పుడమితల్లి మాలగుచ్చుకుంటున్నట్టు
ఒకో నీటి ముత్యం టెలిఫోను తంత్రుల నించి కాంతులు చిమ్ముతూ
తీగలోంచి జారుతున్నాయి నెమ్మదిగా దారంలో పూసల మాదిరి
జంటగా యిలాంటి దృశ్యాలెన్ని చూసి పరవశించాం
ఆసువుగా కవితలెన్ని చెప్పుకుని మురిశాం
'అభి న జావో ఛోడ్‌కర్ యే దిల్ అభి భరా నహీ'
అంటూ మురిపాలు గుమ్మరించిన నీవే
వందల అడుగులు చేతిలో చెయ్యేసి నడిచిన మన ప్రేమ బంధాన్ని కాదని
ఏడడుగులు నడిచిన వానితో దూరతీరాలెందుకు ఎగిరిపోయావో
ఇది ప్రేమలో, రూపాయిలో లేని 'డాలర్' మహిమా
నిర్దయగా నీవెళ్లిపోయినా నీ తలపులెందుకు నాకింకా
మర్చిపోవడానికి మందైనా చెప్పి పుణ్యం కట్టుకోరాదా!

-డి. కామేశ్వరి

ఒక్కసారిగా రావడం చాలా కష్టం. అయితే అది ఎంత తొందరగా అలవరచుకోగలిగితే నువు అంత తొందరగా ఈ వృత్తికి ఫిట్ అవుతావు. ఏమంటావ్?"

"సార్! నేను మీ దగ్గర చేరి మూడు నెలలు కావ స్తోంది. నాలో వచ్చిన మార్పుకు నేనే ఆశ్చర్యపోతు న్నాను- యింత సంయమనంగా ఎలా ఉండగలుగు తున్నానా అని. మీరు కన్నతండ్రిలా నన్ను ఎన్ని సంఘట నలలో కాపాడకపోయి ఉంటే నేను పరువు ప్రతిష్ఠ పోగొట్టుకోవడమే కాదు, ఈ పాఠశాలకు కూడా ఎంతో అపకీర్తి తెచ్చి ఉండేవాడిని. ఇదంతా మీ చలవే సార్!"

"నా అంత అనుభవం వచ్చేసరికి నీకే ఆ శక్తి అలవడుతుంది. నా బాధ అది కాదు శివరామ్. కేవలం జీతం రాళ్ళ మీదే ఆధారపడుతూ నునకు వచ్చిన విద్యనంతా విద్యార్థులకు ధారపోస్తూ వృత్తికి అంకితమైన ఉపాధ్యాయులు ఎందరో మనలో ఉన్నారు. అయినా యీనాటి సమాజంలో ఉపాధ్యాయుడు కించపరచబడు తున్నట్టుగా మరెవరూ అవమానం పొందడంలేదు. దానికి కారణం మనం గీత లోపల ఉన్నవాళ్ళం. అలా అవమానపరుస్తున్న వాళ్ళంతా గీత అవతల నిలబడి ఉన్నవాళ్ళు.

'విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయు లదే' అని గీత అవతల నిలబడి రాజకీయ నాయకుడి నుండి ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న అటెండరు వరకూ స్టేట్‌మెంట్లు ఇచ్చేవారే.

బాధ్యతగా వ్యవహరించవలసిన టీవీ చానల్సు, పత్రికలు వారి వారి మార్కెట్ పెంచుకోవడం కోసం ఎంత విష సంస్కృతిని విద్యార్థుల ముందర కుమ్మరిస్తు న్నాయో అందరికీ తెలుసు. వాటినెవరూ కంట్రోల్ చెయ్యరు. విద్యార్థుల జీవితాలపై ఏభై శాతం ప్రభా వాన్ని చూపించేవి అవే!

మీరడిగిన డబ్బు కట్టి మేం మా పిల్లలను చేర్చు తున్నపుడు వారి బాధ్యత మీదే అని బాధ్యతా రహి తంగా ప్రవర్తించే తల్లితండ్రులను ఎవరూ ప్రశ్నించరు.

చదువుతున్న చదువుకీ, దేశంలో జరుగుతున్న అన్యాయాలను, అత్యాచారాలను, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రిస్తున్నామంటున్న పోలీసు వ్యవస్థకు, నేరం చేశారని తెలిసినా సాక్ష్యాధారాలు లేవనే నిష్కల్మష తీర్పును అమలు పరుస్తున్న న్యాయ వ్యవస్థకూ పొంతన లేదు.

ఇటువంటి సమాజంలో ఉపాధ్యాయుడు ఒక సమి ధలా మారుతున్నాడు. అంగబలం, అర్థబలం ఉన్నవాడు మనగలుగుతున్నాడు. అవి లేనివాడు వృత్తి యిస్తున్న రూపాయల జీతం కోసం తనలోని నిజమైన మనిషిని చంపుకు బ్రతుకుతున్నాడు.

మొదటి రోజున నిన్ను చూసినపుడు నేను ఒకటే ప్రశ్న అడిగాను, గుర్తుందా? ఎందుకు ఈ వృత్తి సెలెక్ట్ చేసుకున్నావని?

"ఈ మాష్టారి వల్ల నా జీవితానికి పనికొచ్చే రెండు విషయాలు అయినా నేను నేర్చుకున్నాను అనుకునేలా ఒక్క విద్యార్థిని తయారు చేసినా నా యీ జన్మ ధన్యమై నట్లే సార్" అన్నావు నువ్వు.

"ఆవేశం చల్లార్చుకుని విద్యార్థిలో మార్పు తీసుకు వచ్చేలా నచ్చచెప్పాలి గాని, మనలను నేరస్థులుగా చేసే సాక్ష్యాలుగా పిల్లల్ని కొట్టకు బాబు. ఇదే నీకు నేను చెప్పదలచుకున్నది. ఇపుడు నువ్వేం చెప్పినా నేను వింటాను. నీ యిష్టం" అన్నారాయన!

"అర్థమైంది సార్! నేను చేసిన తప్పేమిటో బాగా అర్థం అయింది! మీకు నా వల్ల మరోసారి యిలాంటి పరిస్థితి రానివ్వనని మాట యిస్తున్నాను సార్! ఇక నేను వెళ్ళిరానా?" అడిగాడు శివరామ్.

"వెరీ గుడ్! ఇంతకీ రేపు నువు మా యింటికి భోజనానికి వస్తున్నావా లేదా? నువు వచ్చినప్పటి నుంచీ ఏదో ఒక వంకతో దాటవేస్తున్నావ్! రేపు వచ్చి తీరాలి. ఏమంటావ్?"

"తప్పనిసరిగా సార్! రేపు సెలవు పెట్టనా! మీరు కూడా పెడుతున్నారా?" అడిగాడతను లేస్తూ.

"రేపు ఆదివారమయ్యా!" నవ్వారాయన.

❍ ❍ ❍

కడుపు నిండా తృప్తిగా తిని చేతులూ కాళ్ళూ కడుక్కుని వచ్చి మాష్టారితో పాటుగా ఉయ్యాల బల్లమీద ఆయనకు ఎదురుగా కూర్చున్నాడు శివరామ్.

మాష్టారి భార్య అన్నపూర్ణమ్మగారు వచ్చి తమలపాకులు, కవిరి, జాజికాయ, జాపత్రి, కుంకుమ పువ్వు, కూజానా, పచ్చకర్పూరం, దాల్చిన చెక్క, వక్క పొడి, సున్నం, అన్నీ ఉన్న డబ్బాలు అమర్చిన పళ్ళాన్ని వారి ముందుంచారు.

ఆమె ఎందుకో పదే పదే తనని పరికించి చూస్తూ అదోలా అయిపోవడం గుర్తించిన శివరామ్‌కు ఏమీ అర్థం కాలేదు.

తాను నిత్యం వేసుకునే తాంబూలంలోని ఆ పదా ర్థాల వైశిష్ట్యం వివరిస్తూనే ఆయన రెండు తాంబూలాలు చుట్టి ఒకటి అతనికి యిచ్చి రెండవది తాను నోట్లో

పెట్టుకుని 'యిపుడే వస్తాను' అని తన పడక గదిలోకి వెళ్ళారు.

మరో రెండు నిముషాలలో ఆయన, భార్య ఒక చేతిలో ట్రేతో తిరిగి వచ్చారు. అందులో కొత్త బట్టలు న్నాయి.

"బాబూ శివరామ్ యిలారా!" పడమర దిశగా నిలబడిన తమవైపు రమ్మన్నట్టు పిలిచారాయన.

శివరామ్ వెళ్ళి వారికి అభిముఖంగా నిలబడ్డాడు.

"బాబూ!" అంటూ ఆయన శివరామ్‌ను పుత్రవాత్సల్యంతో గాఢంగా కౌగలించుకున్నారు. ఆయన కళ్ళు ఎందుకో చమర్చాయి.

తరువాత భార్య అందించిన ట్రేలోని కొత్త బట్టల జతను అతనికి అందించి అక్షితలతో అతనిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారా దంపతులు.

"సార్! ఏమిటిదంతా?" విస్తుబోతూ అడిగాడు శివరామ్.

"బాబూ శివరామ్. ఈ సమాజంలో ఎవరెవరు తమ తమ వృత్తులకు ఎంతవరకూ న్యాయం చేస్తున్నారో నాకైతే తెలియదు గాని- ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరం మనం తీసుకునే ప్రతి పైసకు న్యాయం జరిగేలా అంకిత భావంతో బోధించాల్సిన అవసరం వుంది. లేకుంటే మన వల్ల పిల్లలకు అన్యాయం జరిగి అది తిరిగి మనకు దెబ్బ కొట్టే ప్రమాదమూ ఉందని

### కళ్ళు

**హృ**దయం కదిలితే
వర్షించే మబ్బులు
వీక్షించే 'కళ్ళు'

### ముళ్ళు

**ఒ**ళ్ళు దగ్గర పెట్టుకుని ఓ మూలనుండి,
జోలికొచ్చిన వారిని జాలి లేకుండ
శిక్షించేవి - రక్షించేవి 'ముళ్ళు'

### ఆనవాళ్ళు

**ప**క్షులు లేని ఊళ్ళు
పంటలు పండని బీళ్ళు
ఏ నాగరికతకు ఆనవాళ్ళు?

-మంగ్గారపు దివాకర్

నా అనుభవం నాకు పాఠం నేర్పిందయ్యా! అందుకే నిన్ను నేను తరచు హెచ్చరిస్తున్నాను."

"సార్... మీరేమంటున్నారో నాకు అర్థం కావడం లేదు" అయోమయంగా అడిగాడు శివరామ్.

"నీకు అర్థమయ్యేలా చెబుతాను బాబు! నేను ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చేసరికి ఉపాధ్యాయుల జీతాలు చాలా బాగా పెరిగాయి. వాటిని చూసే నేను డిగ్రీ పూర్తిచేసిన మరు సంవత్సరమే బి.యిడి. ట్రైనింగ్ అయి వెంటనే మంచి రికమెండేషన్‌తో ఎటువంటి లంచమూ యివ్వకుండా ఉద్యోగం పొందాను. అంత క్రితం వరకు 'బ్రతకలేక బడిపంతులు' అనేవారట.

ఉద్యోగం వచ్చిన సంవత్సరానికి నాకు వివాహం అయింది. తరువాత యిద్దరు మగపిల్లలు కలిగారు. ఈనాడు కొద్దిశాతం ఉపాధ్యాయులు భావిస్తున్నట్టుగా 'నా జీతం నాకు వస్తోంది కదా! చదువు చెప్తే ఏంటి, చెప్పకపోతే ఏంటి? చదివేవాడు ఎవరు చెప్పినా చదువు కుంటాడు. వాడికి నేనే చదువు చెప్పనవసరం లేదు. చదవని వాడికి నేను ఎంత శ్రద్ధగా చెప్పినా ఎలాగూ చదవలేడు" అన్న నా లాజిక్‌కి నేనెంతో గర్వపడిపోయి నా పిల్లలిద్దరూ బాగా చదవాలనే స్వార్థంతోనే ఉద్యోగం చేశాను- మొదట్లో.

మా పెద్దాడు ఎనిమిదో తరగతిలోకి వచ్చాక చెడు స్నేహాల వైపు మొగ్గడం గమనించిన నేను వాడిని గుంటూరు జిల్లాలో మా చెల్లెలి యింట ఉంచి ఓ అత్యుత్తమ కాన్వెంట్లో వేశాను. వాడికి భౌతికశాస్త్రం అంటే విపరీతమైన భయం ఏర్పడింది. కనీసం పాస్ మార్కులు కూడా వచ్చేవి కావు. కాన్వెంట్ వారే శ్రద్ధ వహిస్తారులే అనుకున్నాను. వాడికి నాకంటే విపరీతమైన భయం. సెలవులకు నా దగ్గరకు వచ్చి ఆ పాఠాలు చెప్పమనేవాడు. 'అంత డౌటు అయినపుడు మీ కాన్వెంట్లో ఎందుకు అడగలేదని' కసురుకున్నాను. వాడు ముఖం గంటు పెట్టుకుని వెళ్ళిపోయాడు.

ఆ రోజుల్లోనే నేను పేపర్లో ఒక యాదృచ్ఛికమైన సంఘటన చదివాను. విజయవాడ నగరంలో ఒకరోజు ఉదయం ఇంటర్ మీడియెట్ చదువుతున్న ఒక కుర్రవాడు ఉదయమే ఆరింటికి సైకిల్ తొక్కుకుంటూ ట్యూషన్‌కు బయల్దేరాడు. తెలతెలవారుతున్న వేళ నగరం యింకా అపుడపుడే మేలుకుంటోంది.

ఆకాశంలో ఎక్కడనుంచో ఒక గ్రద్ద ఒక నల్ల త్రాచును తన కాలి గోళ్ళ మధ్య యిరికించుకుని తన శక్తికొద్దీ ఎగుర్తూ వెళ్తోంది. అప్పటికే ఆ గ్రద్ద ముక్కుతో

పొడవడం వల్ల, గోళ్ళతో చేసిన గాయాల వల్ల తీవ్రమైన బాధతో మెలికలు తిరిగిపోతున్న నల్లత్రాచు దాని నుంచి తప్పించుకునే తీవ్ర ప్రయత్నంలో జారపడి సరిగ్గా వేగంగా సైకిలు తొక్కుకుంటూ వెళ్తున్న ఆ పండంటి కుర్రాడి మెడపై పడింది. ఒక అడుగు ముందు పడినా, ఒక అడుగు వెనుక పడినా అతను బ్రతికేవాడేమో! అది తన బలమంతా చూపిస్తూ అతన్ని కాటు వేసింది. ఆ కుర్రవాడు అక్కడికక్కడే నురగలు కక్కుకుంటూ ప్రాణాలు వదిలాడు.

ఆ పిల్లవాడి శవం దగ్గర తండ్రి భోరున విలపిస్తూ అన్నమాటలు నాకు యిప్పటికీ గుర్తున్నాయి. ఆ తండ్రి ఓ గవర్నమెంటు కాలేజీలో కామర్స్ లెక్చరర్.

"నేను నా వృత్తికి సరియైన న్యాయం చేయక, కన్న బిడ్డల్లాంటి నా విద్యార్థులకు చేసిన అన్యాయమే నా బిడ్డను బలి తీసుకుంది."

అంత యాదృచ్ఛికమైన సంఘటన అప్పటివరకు నాకు తెలియదు.

పదవ తరగతి పరీక్షలు ముగిశాయి. మా వాడు పరీక్షలన్నీ బాగా రాశాడు. అయిన మరునాడే యింటికి వచ్చేశాడు. "భౌతికశాస్త్రం పేపరు ఎలా వ్రాశావని" అడిగాను? "బాగా వ్రాశాను నాన్నా" అన్నాడు.

ఇంతలో నాకు పదవ తరగతి పేపర్ల వేల్యుయేషన్ ఆర్డర్స్ వచ్చాయి. అదే పి.యస్. సబ్జెక్టు.

నేను పేపర్లు దిద్దేసి వచ్చాను. మా పెద్దాడు కంప్యూటర్స్‌లో చేరాడు.

మరో నెల రోజుల్లో రిజల్ట్సు వచ్చాయి. ఈనెల రోజుల్లో వాడు చాలా మూడీగా ఉండేవాడు. వేసవి తీవ్రత వల్లనేమో అనుకున్నాను.

రిజల్ట్సు తెలిసి నేను యింటికి వచ్చేసరికి వాడు తన గదిలో ఫ్యానుకు ఉరిపోసుకుని మరణించి ఉన్నాడు.

వాడి నంబరు చూసి నా మనసులో ఏదో అనుమానం వచ్చింది.

పరీక్ష పేపర్లు దిద్దేటపుడు మన జిల్లా విద్యార్థుల పేపర్లు మనకు రావు. వేరే జిల్లా విద్యార్థుల పేపర్లు వస్తాయి. నేను ఆ సంవత్సరం దిద్దినవి గుంటూరు జిల్లావే. ఆ విషయం గుర్తుకు రాగానే భయంతో వణికి పోయాను.

ఏ రోజు కారోజు పేపర్లు దిద్ది వచ్చాక ఏ నంబరు నుంచి ఏ నంబరు పేపర్లు దిద్దానో నా డైరీలో నోట్ చేసుకునే వాడిని. వెంటనే డైరీ తీసి చూశాను.

ఎంత యాదృచ్ఛికమంటే పేపర్లు దిద్దడం మొదలుపెట్టిన నాలుగవ రోజు నా కొడుకు పేపరు నేనే దిద్దాను.

ఆ ఆన్సరు పేపరులో ఒక్క ప్రశ్నకు కూడా ఆ విద్యార్థి జవాబు వ్రాయలేదు. పైగా, 'పేపరు దిద్దుతున్న మాష్టారికి' అంటూ సబ్జెక్టు పట్ల తన అయిష్టతను, తన కుటుంబ పరిస్థితులనూ తెలుపుతూ, ఎలాగైనా పాస్ చేయమని, లేదంటే తనకు చావే గతని ఉత్తరం వ్రాసాడు. ఆ లెటర్ నా తోటి ఉపాధ్యాయులకు విని పించాను. అందరమూ నవ్వుకున్నాం. దాన్ని కొట్టివేసి సున్న వేశాను. నేను దిద్దిన నాలుగువందల ఇరవై ఎనిమిది పేపర్లలో అలాంటిది అది ఒక్కటే. అందుకు నాకు బాగా గుర్తుంది.

సైన్సులో వాడు ముప్పై నాలుగు మార్కులు వచ్చి ఫేలయ్యాడు. అంటే పి.యస్.లో సున్నా, జీవశాస్త్రంలో ముప్పై నాలుగు.

నేను నా వృత్తి పట్ల చేసిన ద్రోహమే నా కొడుకును బలితీసుకుందని వెక్కి వెక్కి ఏడ్చాను. ఆనాటి నుంచి నా ప్రవర్తనే మార్చుకున్నాను.

ఇలా అందరికీ జరగాలని గాని, జరుగుతుందని గాని నా భావం కాదు బాబూ! ప్రతీ ఉపాధ్యాయుడికి తన వృత్తి పట్ల కనీస ధర్మం ఉండాలని.

ఈనాడు నా కొడుకు ఉంటే సరిగ్గా నీ అంతే ఉండేవాడు. ఈ వేళ వాడి యిరవై ఆరవ పుట్టిన రోజు. వాడిని జ్ఞాపకం చేసుకుని నీలో వాడిని చూసుకో వాలన్న ఉద్దేశంతో మా యింటికి నిన్ను ఆహ్వానించాను. నువు వచ్చావు. మా బిడ్డ మా యింట తిరుగుతున్నంత ఆనందంగా ఉంది బాబు. ఇందులో నిన్నేమయినా బాధిస్తే మమ్మల్ని క్షమించు" అన్నారాయన.

శివరామ్ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగి ఆ దంప తుల పాదాలను తడిపేశాయి.

వారి పాదాలకు చుట్టుకుపోయి చంటి పిల్లవాడిలా రోదించాడు.

రెండు నిముషాలలో భీమశంకరంగారు తేరు కున్నారు.

అతన్ని పైకి లేవదీసి కన్నీళ్ళు తుడిచారు.

అతన్ని మనసారా కౌగలించుకుని పుత్రప్రేమతో పులకించిపోయారాయన.

"ఈ క్షణం నుంచి నువు ఆ దేవుడిచ్చిన కొడుకువి మాకు" అంటూ ఆశీర్వదించారాయన. శివరామ్, రాముడు కౌగిలించుకున్న ఆంజనేయుడిలా మౌనంగా కళ్ళుమూసుకున్నాడు. ■